# విరజీలగాలి?!

ఆర్. దమయంతి

అర్ధరాత్రి దాటింది.....

చీకటి...కటిక చీకటి....

ఎముకలను కొరికే చలి....బైట....

బెడ్‌రూంలో...డబుల్‌కాట్‌ 'యూం ఫోం' బెడ్‌మీద అతను అసహనంగా కదుల్తున్నాడు. కప్పుకున్న బ్లాంకెట్ చలిని ఆపలేకపోతోంది. వేసుకున్న వూలు స్వెట్టర్ అతనిలో వేడిని పెంచుతోంది...

ఇటుగా తిరిగి భార్య వంక చూసాడు...

హాయిగానిద్రపోతోంది...

బోర్లా పడుకుని, గడ్డం కింద చేతులు ఆన్చి పరీక్షగా ఆమెనే చూస్తున్నాడు — వనమాలి.

'ఎంత అందంగా వుంది' అనుకున్నాడు.

విల్లులా వంగిన కనుబొమలు...

చెంపకు చారెడేసి కళ్లు — మూసుకున్నా ఎంత బావున్నాయో

కొనదేలిన చిన్న ముక్కు...

ముక్కుకున్న వజ్రపురాయి ముక్కు పుడక

తళుక్కుమంటూ మెరుస్తోంది చీకట్లో...

నిద్రలో తొలగిన పైట...

కన్పించీ కనిపించని అందాలు అతన్ని వూరిస్తున్నాయి...

నీలి రంగు బెడ్‌లాంప్ మసక వెలుతురులో ఆమె మరింత అందంగా కన్పిస్తోంది అతనికి.

ఆమెతో గడిపిన తొలి రోజులు...తీపి జ్ఞాపకాలు...మధురానుభవాలు...అతని మనసును వూరిస్తున్నాయి.ఆమెనేదేదో చేసేయమని అతన్ని వుసిగొల్పుతున్నాయి...

అర్ధక్షణంలో కదిలి...మళ్లీ క్షణం సేపు ఆగి ఆలోచిస్తున్నాడు....

రంభలాంటి భార్య ఇంట్లో వుండికూడా తనకెందుకో ఈ బ్రహ్మచర్యం...

నిద్రలేకుండా ఎన్ని రాత్రిళ్ళని గడపడం...! ఉహూ...ఇక తను ఆగలేడు...

కొంచెం దగ్గరగా జరిగి భార్య ముఖంలోకి తొంగి చూశాడు.

"ఇంత అమాయకంగా వున్నా... ఎంత మొండితనమో! అనుకుంటూ తనలో తానే నవ్వుకున్నాడు.

నిద్రలో కూడా నవ్వుతున్న అధరాలను ఆర్తిగా అందుకోబోయాడు.

"ఊ..."నిద్రలోనే మత్తుగా మూలిగింది సంధ్య ఆమె చేతులు అతన్ని గట్టిగా చుట్టుకున్నాయి...ఇంకా దగ్గరగా లాక్కుంది.

అనుకోని ఆనందాన్ని పట్టలేకపోయాడు వనమాలి మునిపంటితో నును చెంపని కొరికి... శంఖంలాంటి మెడను ముద్దెట్టుకొని... ఆమె గుండెల్లో తలదాచుకున్నాడు... ఇంకేదో చేయబోతూ... కళ్ళు మూసుకోబోతున్న వనమాలి వొక్క విసురుకు వెల్లకిలా పడ్డాడు.

కలంతా చెదిరిపోయింది...

మత్తంతా ఎగిరిపోయింది...

మైకమంతా దిగిపోయింది...

అవమానంగా వుంది...

పట్టలేని కోపం కూడా వచ్చింది...

పళ్లు బిగించి సంధ్యవైపు చూశాడు...

"ఛీ..." విదిలించినట్లు... అసహ్యంగా చూస్తోంది.

"నువ్విక మారవన్నమాట" విసురుగా అడిగాడు.

"అంత తేలిగ్గా మారే తప్పేనా మీరు చేసింది!" వాత పెట్టినట్టు వుంది ఆమాట.

వనమాలి ఆవేశాన్ని ఆపుకున్నాడు...

"తప్పు... తప్పు... తప్పు... ఏమిటే నేను చేసిన తప్పు! నీకు నిజం చెప్పటమేగా నేను చేసిన తప్పు!! నీ సంగతి తెలీక నోరు జారాను...కాదు...మనసు విప్పి చెప్పకుందామని...చెప్పాను...జరిగిపోయిన ఆ విషయాన్ని పట్టుకుని నన్నెనాళ్లు సాధిస్తావ్...ఇలా ఎంతకాలం దూరంగా వుంచుతావ్..."

"......."

"ప్లీజ్... సంధ్యా... నన్ను నమ్ము... ఇప్పుడు నాకు ఆమెకూ ఎటువంటి..." అనునయించబోయాడు.

"...సంబంధంలేదంటే నమ్మేస్తాననుకుంటున్నారా! చస్తే నమ్మను. పెళ్లికాక ముందు వున్న సంబంధం ఇప్పుడు లేదంటే ఎలా నమ్మటం!"

"పులి వొకసారి నరమాంస రుచి మరిగితే మరోసారి విడుస్తుందా!

"అలాగే... పరస్త్రీ పొందుకు అలవాటు పడిన మగాడు పెళ్లాంతోనే సంతృప్తి పడతాడని నేననుకోను. అలాంటి మగాడ్ని మడికట్టుకొని వుండమంటే ఎలా వుంటాడు...! ఇప్పుడు మీకూ, దానికీ సంబంధం లేదంటే..."

"నోర్ముయ్!" మెల్లగా అరిచాడు.

అతనికి కోపం, కసి... పెరిగిపోతున్నాయి... ఏమీ చేయలేకపోతున్నాడు...

తనమీద తనకే చికాకు... విసుగు...

"నీకు మతిపోయింది. అందుకే ఇలా మాట్లాడి నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నావ్... రాత్రిళ్లు... ఇలా దూరంగావుంచి...నన్ను...నన్ను వెర్రివాణ్ణి చేస్తున్నావ్..." తల పట్టుకున్నాడు వనమాలి.

"నేనేం చేయలేదు. అన్నీ మీరే చేసుకున్నారు. విరహవేదన అనుభవిస్తోంది నేను. రాత్రిళ్ళు నిద్ర పట్టక... ఇదిగో... ఈ నిద్రమాత్రలు మింగి మరీ నిద్ర పట్టించుకుంటున్నా" పిల్లో కింద సీసా తీసి చూపిస్తూ అంది.

సీసా లాక్కోబోయాడు వనమాలి.

గుప్పిట్లో గట్టిగా నొక్కి పట్టుకుంది. "ఇలా మాత్రలు మింగి ప్రాణమైనా తీసుకుంటాను గానీ...మిమ్మల్ని...మిమ్మల్ని మాత్రం తాకనీయను..."ఖచ్చితంగా చెప్పేసింది.

ఆ మొండితనానికి వనమాలికి చిర్రెత్తింది.

"ఏం... ఎందుకు" అడిగాడు.

"మీరంటే అసహ్యం...మీ చేయి తగిలితే గొంగళిపురుగు పాకుతున్నట్టు వుంటుంది. మీ వేడి నిట్టూర్పు సోకితే శరీరం నిప్పులో పడి మాడిపోతున్నంత బాధ కల్గుతుంది... మీతో ఈ నరకం అనుభవించడం నా వల్ల కావటం లేదు..." ఆమె గొంతు గాద్గదికమైంది.

సంధ్య మాటలు తిక్క పుట్టించాయి. కోపంతో విసురుగా లేచి నిలబడ్డాడు.

"నేనన్నా, నా స్పర్శ అన్నా అంత అసహ్యమైతే నన్నెందుకు కావాలని మరీ పెళ్లి చేసుకున్నావ్ యిష్టం లేదని పెళ్లికి ముందే చెప్పలేకపోయావా... రాస్కెల్..." ఆగిపోయాడు..

చివ్వున తలెత్తి చూసింది సంధ్య...

**సెక్రటరీ జూలీ వనమాలిని లైక్ చేసింది... అందంతోబాటు తెలివి, చురుకుదనంగల జూలీ అంటే వనమాలికి్కూడా అభిమానం... ఇష్టం... అందుకే అప్పుడప్పుడు సరదాగా ఆమెతో మాట్లాడ్తూండేవాడు.**

కళ్ల నుంచి చెంపల మీదుగా జారుతున్నాయి కన్నీళ్ళు... అంతలోనే కళ్లలో రంగులు మారాయి.

"ఔను. మిమ్మల్ని పెళ్లి చేసుకోవటం ససేమిరా ఇష్టం లేదని పెళ్ళికి ముందే చెప్పేదాన్నే — మీరా నిజాన్ని ముందే గనుక చెప్పి వుంటే — మీ నీడను... మీ నీడనుకూడా చూసేదాన్ని కాదు. కానీ...ఇప్పుడు అంతా అయిపోయాక..." ఆ పైె మాట్లాడలేకపోయింది. దిండులో ముఖం దాచుకొని వెక్కివెక్కి ఏడుస్తోంది.

వనమాలి కోపమంతా చప్పున చల్లారిపోయింది. అగ్నిలాంటి ఆవేశం మీద నీళ్ల దిమ్మరించనట్టయ్యింది... అసహాయంగాఅలాగే చూస్తూ నిలబడి పోయాడు.

కొన్ని క్షణాల తర్వాత...బెడ్‌రూంలోంచి మెల్లగా అడుగులు వేసుకుంటూ బాల్కనీలోకి వచ్చి నిలబడ్డాడు...

చుట్టూ చీకటి...

తుంపరలా కురుస్తున్న మంచు...

నైట్‌గౌనులోంచి లైటర్‌తీసి సిగరెట్ వెగించాడు. గుండెనిండా దమ్ములాగి మెల్ల...మెల్లగా పొగను బైటకొదిలాడు.

కొన్ని నిముషాల క్రితం పని చేయని మెదడు తిరిగి మేల్కొంది. మళ్లీ ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

"ఎందుకిలా మారిపోయింది సంధ్య!" ఎన్నిసార్లు అనుకున్నా... మొదటిసారిగా అనుకుంటున్నట్టుంటుంది అతనికి.

దీనికంతటికీ కారణం — తనేనేమో!?

ఔను...తనే?

జూలీ సంగతి చెప్పకుండా వుండాల్సింది...

గతమంతా కళ్ల ముందు మెదిలింది.

*　　*　　*

ఇరవై ఆరేళ్ల వనమాలి కున్న డిగ్రీలు చూసి 'పేరుకన్నా నీ డిగ్రీ అక్షరాలే ఎక్కువ' అంటూ అందరూ పొగిడేవారు.

కృషి ఫలితమో, కలిసొచ్చిన అదృష్టమో గానీ, ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో వనమాలి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఎప్పాయింటయ్యాడు. అనుకున్న ఆశయం నెరవేరినందుకు తృప్తిపడ్డాడు.

రెండువేల హౌస్ ఎలవెన్స్... కారు మెయిన్‌టెనెన్స్ ఏడాదికి వొకసారి ఇండియాలో ఏ ప్రదేశానికి వెళ్లినా అయ్యే ఫ్లయిట్ ఖర్చులు అన్నీ కంపెనీయే భరిస్తుంది. ఇన్ని సదుపాయాలు ఇచ్చే పేరున్న కంపెనీలో వున్నత హోదాలో వున్న వనమాలిని చూసి చాలా మంది ఈర్ష్యపడేవారు. వనమాలి మాత్రం గర్వంగా ఫీలయ్యేవాడు...

సెక్రెటరీ జూలీ వనమాలిని లైక్ చేసింది. అందంతోబాటు తెలివి, చురుకుదనం గల జూలి అంటే వనమాలికీ్కూడా అభిమానం... ఇష్టం... అందుకే



అప్పుడప్పుడు సరదాగా ఆమెతో మాట్లాడుతూండేవాడు. అలా జూలీతో మాట్లాడకపోతే తోచేదికాదు. రానురాను అదో అలవాటుగా మారిపోయింది. జూలీతో జాలీగా కబుర్లు చెప్పుకోవటం ఎందుకో బావుండేది...

ఓసారి మాటల్లో చెప్పింది జూలి
"మిమ్మల్ని విడచి వుండబుద్ధికావటం లేదు"
నవ్వాడు వనమాలి.
"మీకో మాట చెప్పనా!" అంది
"చెప్పు" అన్నాడు.
"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నా..."
ఫక్కున నవ్వాడు.
"జోక్ కాదు. మీకూ నేనంటే ఇష్టమైతే మనిద్దరం... కల్సుకుందాం" సూటిగా కళ్ళలోకి చూస్తూ ఎంతో మామూలుగా అడిగింది.

వనమాలి నవ్వు ఠక్కున ఆగిపోయింది.

సరదాకే అన్నదేమోనని జూలీవైపు పరీక్షగా చూశాడు. ఎర్రటి పెదవులు ఎప్పటిలాగానే నవ్వుతున్నాయి. ఆమె కళ్ళు అతని వైపు ఆరాధనగా చూస్తున్నాయి.

ఆ రాత్రంతా వనమాలికి నిద్రపట్టలేదు. కళ్ళు మూసినా, తెరచినా జూలీ రూపమే..

నీలికళ్ళు... గులాబి బుగ్గలు...

ఎర్రి పెదవులు..నున్నటి పాలరాతి శరీరంలో అజంతా వొంపులు... నగ్నంగా వూహించుకుంటే గుండెలో తీయటి గుబులు... మనసులో ఏదో తెలియని అలజడి...

'మీకూ నేనంటే యిష్టమైతే...మనం కల్సుకుందాం' జూలీ మాటలు పదేపదే వినిపిస్తూ, మత్తును కల్గిస్తున్నాయి...

ఆ మర్నాడు...

వనమాలి వైపు ఆశగా చూస్తున్న జూలీ తెల్లని చేతిని తన చేతిలోకి తీసుకుని మెత్తటి అరచేతిలో చిన్నగా ముద్దెట్టుకున్నాడు.

ఆనందం పట్టలేక అతని మెడని చుట్టేసుకొని, పెదవులను గట్టిగా కొరికి వదిలేసింది.

నరం నరం జివ్వుమంది. శరీరంలో ఈ ప్రకంపన భలే మత్తుగా, గమ్మత్తుగా అన్పించింది— అతనికి...

సావేరి అపార్ట్‌మెంట్‌లో తానుంటున్న నాలుగో ఫ్లోర్‌లోని ఆరవ ఫ్లాట్‌లో ఆ రోజు రాత్రి జూలీతో గడిపాడు. ఆ మర్నాడు థాంక్స్ చెప్పింది ముందుగా జూలీనే!

ఆ వొక్కరోజే కాదు... ఆ తర్వాత అప్పుడప్పుడు చాలా సార్లు కలిసారు వాళ్ళు...

రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ కూతురు సంధ్యను పెళ్ళిచూపుల్లో చూసినపుడు వింత అనుభూతి కల్గింది. పెళ్లి చేసుకుంటే సంధ్యనే చేసుకోవాలి అనుకున్నాడు.

తాంబూలాలు పుచ్చుకున్న తర్వాత వోరోజు సంధ్యను వొంటరిగా కల్సుకుని దగ్గరకు తీసుకోబేతే ఎంతగా బెదిరిపోయింది? నవ్వుకున్నాడు.

పెళ్లి తర్వాత సంధ్యే లోకం... సంధ్యే ధ్యానం... సంధ్యే ప్రాణం... అందంతో ఆకర్షించుకొని.. అనురాగంతో మనసును అల్లుకుని తననింతగా అకట్టుకుని అలా కట్టిపడేసిన సంధ్యతో రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి..

వోనాటి వెన్నెల రాత్రిన... వొళ్ళు తెలియని పరవశంలో.. మనసు విప్పి మాట్లాడాలన్పించింది వనమాలికి. ఆ క్షణంలో... జూలీ గురించి తన గురించి అంతా చెప్పేశాడు.

అంతే... ముగ్ధలా వున్న సంధ్య మహంకాళిలా మారిపోయింది. అనురాగం స్థానంలో అసహ్యం నిల్చింది. ప్రణయ దేవత కాస్తా... ప్రళయ దేవిలా మారిపోయింది.

ఆ అవతారాన్ని చూడలేకపోయాడు. ఆమె ఎడబాటును భరించలేకపోయాడు. జూలీకీ తనకు ఇప్పుడెటువంటి సంబంధం లేదని... పెళ్లయిన తర్వాత అసలు ఆ ఆలోచన కూడా తనకు కల్గలేదని మొత్తుకున్నాడు. ఎన్నివిధాలా బతిమలాడినా... 'వూహూ...' సంధ్య వినలేదు.

పెళ్ళికి ముందున్న సంబంధం ఆ తర్వాత మాత్రం ఎందుకు కొనసాగకూడదూ అంటూ 'లా' పాయింటు లాగింది. పగలంతా జూలీతో రాచలీలలు సాగించి రాత్రిళ్ళ తన ప్రక్కకి చేరి హాయిగా నిద్రపోతున్నాడని సాధించడం మొదలెట్టింది. రోజురోజుకు సంధ్య వేధింపులు ఎక్కువైపోతున్నాయి. ఇల్లు నరకంగా మారింది. ఇల్లాలు శత్రువైపోయింది.

సంధ్య ఇంత మొండిదనీ, మూర్ఖురాలనీ అతను అనుకోలేక పోయాడు.

ఇప్పుడు దీనికి పరిష్కారం ఏమిటి! ఆలోచిస్తున్నాడు...

* * *

ఆ రోజు...

జూలీని ఇంటర్‌కంలో పిలిచాడు.

"వొకసారి రాగలరా!"

మూడు క్షణాల తర్వాత తనకెదురుగా తలొంచుకొని నిలబడ్డ జూలీని చూస్తున్నాడు...

జూలీ బాగా చిక్కిపోయింది.

ఇదివరకటి చురుకుదనం... చలాకితనం... ఆమెలో ఇప్పుడు లేవు.

వ్యథ చెందుతున్న భావాలు ఆ కళ్లల్లో ప్రస్ఫుటంగా కొతున్నాయి. గులాబి రంగు చెక్కిళ్ళు తెల్లగా పాలిపోయాయి. విషాదరేఖలు పెదవులమీద కదుల్తున్నాయి.

ఆ ఎదలోని బాధ ఏమిటో తెల్సుకోవాలని తాను ఇన్నాళ్ళ ఎందుకు ప్రయత్నించలేదు!

తన పెళ్లికి రాని జూలీ... పెళ్లి తర్వాత మూడు నెలలు శెలవులో వున్న జూలీ... అతనికి అర్థమౌతోంది.

'జూలీ?' మెల్లగా.. ఆప్యాయతగా పిలిచాడు. వులిక్కిపడి... ఆశ్చర్యంగా చూసింది ఆ పిలుపుకు.

"జూలీ? ఐ లవ్ యూ" చెప్పాడు.

రెండు క్షణాల తర్వాత...

ఆమె కళ్ళ వర్షిస్తున్నాయి... ఆనందంతో...

* * *

ఆ రాత్రి...

"నిజంగానా?... నన్ను నమ్మమంటారా!" ఛాతీమీద గిరిజాల జుట్టును సవరిస్తూ అడిగింది సంధ్య?

"ఇంకా అనుమానమా! నీ వజ్రపు ముక్కుపుడకమీద వొట్టు" చిలిపిగా అన్నాడు.

చిన్నగా నవ్వింది సంధ్య. భర్త గుండెకు హత్తుకుపోతూ చెప్పింది. "మీ మనసు తెల్సుకోలేక ఇన్నాళ్ళూ రాక్షసిలా ప్రవర్తించి మిమ్మల్ని హింసించాను. రియల్లీ... ఐయామ్ సారీ..."

"అమ్మయ్య" అనుకున్నాడు. గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు.

అర్థగంట తర్వాత...

ప్రశాంతంగా... హాయిగా... ఆదమరచి నిద్రపోతున్న వనమాలి వైపు చూస్తూ అనుకుంది సంధ్య.

అలా సాధించి, వేధించబట్టేగా జూలీని వేరే వూరులోవున్న బ్రాంచ్ ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేయించింది? హు? మగాడ్ని ఎలా అదుపులో పెట్టాలో... మొగుడ్ని ఎలా కొంగున ముడివేసుకోవాలో తనలాంటి తెలివిగలవాళ్ళకే తెలుసు...

'మీరజాలగలడా...' గర్వంగా నవ్వుకుంది.

* * *

"త్వరగా వచ్చేస్తారుగా" టై సరిచేస్తూ గారాబంగా అడిగింది.

"పనయిపోవాలేగానీ... ఈ రాత్రి ఫ్లయిట్లోనే వచ్చేస్తానోయ్" ముక్కుమీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు.

"అలాగే అంటారు. ఇదిగో అదిగో అని వారం రోజులకొస్తారు" బుంగమూతి పెట్టింది.

"లేదు. ఈసారి త్వరగా వచ్చేస్తానుగా. టైమవుతోంది" తొందరచేసాడు.

బ్రీఫ్‌కేస్ అందించింది.

కారెక్కిన తర్వాత చేయి వూపాడు.

కనుచూపు మేర వరకు చూసి... ఆ తర్వాత లోపలకొచ్చి అనుకుంది. "ఏం, కాంప్‌లో ఏమో... బోర్..."

కారులో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తూ అనుకుంటున్నాడు వనమాలి...

కాంప్‌ల పేరుతో నెలకు రెండుసార్లు తాను బెంగుళూర్ కెళ్లేది ఆఫీసు పని మీద కాదని... తనకోసమే జీవిస్తూ... తనను ప్రాణంగా ప్రేమిస్తూ తన ప్రేమకోసమై తల్లడిల్లిపోయే జూలీ కోసమేనని ఆమెతో గడిపే ఆ నాల్గు రోజులే తనకు సుఖాన్ని శాంతిని యిస్తాయని సంధ్యకెలా చెప్పటం! కాదు... అసలెందుకు చెప్పటం!" సీట్ వెనక్కి వాలి తమాషాగా నవ్వుకున్నాడు వనమాలి. *

